
# ఎస్-6

చెన్నా రామమూర్తి

**రైలొచ్చి ప్లాట్‌ఫారం పైన ఆగింది.**

**అంతవరకూ ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉత్సాహంగానూ, గందరగోళంగానూ..., అయోమయంగానూ... కొన్ని కేకలు... ఇంకొన్ని వీడ్కోళ్ళు... ఆత్మీయచూపులు... అభిమాన భావాలు... రైలొచ్చిన తర్వాత వాతావరణమే వేరుగా ఉంటుంది.**





మా ఊరి కోటా కోచ్ 'ఎస్ 6' కంపార్ట్‌మెంట్ లోకి ఎక్కి కూర్చున్నాం. ఆ బోగిలో ముందుగా రిజర్వేషన్ చేయించుకొని వస్తున్న వాళ్ళను గూడా సర్దుకోమని చెప్పి కూర్చోవడం మామూలుగా జరిగే తంతే... 'పక్క స్టేషన్‌లో దిగిపోతాం' అనే రెగ్యులర్ డైలాగ్ ఒకటి ప్రకటించేస్తాం... ఎస్ 6 లోకి టికెట్ తీసుకొని ఎక్కే వాళ్ళ సంఖ్య అసలుండదంటే ఆశ్చర్యం కాదు.

రైల్లో అన్ని బోగీల పరిస్థితి ఒకలా ఉంటే... ఎస్6 బోగి పరిస్థితి మరోలా ఉంటుంది. మా బోగి... మా ఇష్టం అనే రాజసం ఎక్కిన ప్రతిముఖంలో కనిపిస్తుంది. రెండు వారాలకు ముందే రిజర్వు చేయించుకుని రైలు ఎక్కే వాళ్ళకు లేని ధీమా వీళ్ళకుంటుంది.

ఎల్లో సిగ్నల్ పడగానే...గార్డ్ విజిలేసి పచ్చజెండా చూపాడు... తప్పదన్నట్లు రైలు చిన్నగా కదిలింది.

మా రమకు రైలు ప్రయణమంటే చాలా ఇష్టం. కాదంటే స్కూలు గూడా ఎగ్గొట్టి ఏడుస్తూ కూర్చుంటుంది.

అందుకే చేరవలిసిన గమ్యం చేరువే అయినా రమ కోరిక మేరకు రైల్లోనే ప్రయాణిస్తున్నాం.

రైలు అటూ ఇటూ కుదుపుతూ సరదాగా వెళ్తూంటే రమకి ఆనందం అవధులు దాటుతోంది... వేగంగా చేరువై, వెనువెంటనే పరుగులు తీసే చెట్లను, గుట్టల్నీ చూసి ఆశ్చర్యపడుతూ ఉంది... ఎగిసి గంతేస్తూ ఉంది. ఇందాక ఆగిన స్టేషన్లో కాసేపు ఎక్కువ ఆగింది రైలు. మా ఎదురు సీట్లో నలుగురు వచ్చి కూర్చున్నారు.

రైల్లో...పల్లీలు, బత్తాయిలు, జామ అమ్మే వాళ్ళ సందడి అదోరకమైన చిన్నసైజు ప్రపంచం.

ఆ నలుగురిలో ఒకతను ఆ గుంపును కదిలిస్తున్నట్లున్నాడు. తెల్లటి నలగని చొక్కా, కళ్ళకు ఫొటోగ్రే అద్దాలు, మెడలోచైను, చేతికి బ్రాస్‌లెట్, అవీ ఇవీ కలిపి మనిషి హుందాగా ఉన్నాడు. వారి మాటల్లో కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు సాగే రాజకీయం, హాలీవుడ్ నుండి బాలీవుడ్ దాకా రగులుతున్న హత్యల భయం, పెరిగే ఉల్లి ధరలు, గ్లోబలైజేషన్, తినే తిండి.. గురించి సాగుతున్నాయి. సమాజం మీద మంచి పట్టున్న వ్యక్తిలా ఉన్నాడు.

ఆయన చెప్పే మాటలకు ''తానా...తందానా...'' అంటున్నారు మిగిలిన ముగ్గురు...అప్పుడపుడు ఆయన మాటల్లో ద్యోతకమయ్యే విషయాల్ని చూస్తే భవిష్యత్తులో, రాజకీయ నాయకుడు అవుతాడని తోస్తోంది. అందుకే ఆ ముగ్గురూ ఆయన అడుగులకు మడుగులొత్తుతున్నారు కాబోలు.... అంతలో- ''ముసంబీ...ముసంబీ...'' అంటూ ఒకాయన గంప తెచ్చాడు. గంప అక్కడుంచగానే అందరూ చేతుల్లోకి కాయల్ని తీసుకున్నారు...రేటు నిర్ణయించలేదు. నిర్ణయిస్తే నేనూ తీసుకోవాలని.

''అమ్మగారు...కాయలు తీసుకోండమ్మా... తాజా కాయలు....'' అన్నాడు కాయలాయన.

''డజనెంత-?' అన్నాను.

''ఇరవై రూపాయలమ్మా...తాజా పండ్లు...''

''ఇరవయ్యే...పదహైదు చేసుకో...''

''రావమ్మా... ఇరవైకి తక్కువ రావు...'' అన్నాడు తెగేసి చెబుతూ.

ఎదుటి వాళ్ళు ఎంతిస్తారో చూడాలని ఎదురు చూశాను.

వాళ్ళకెవరికీ డబ్బు ఇవ్వాలన్న ధ్యాస లేనట్లుంది.

కాయలాయన అటూ ఇటూ చూసి వెళ్ళిపోయాడు.

ఎదురుగా కూర్చున్నాయన, నాకు,రమకు చెరో కాయ ఇచ్చాడు.

''వీళ్ళంతే లేమ్మా...అమ్ముకునే రకం కాదు... ఈ ప్రాంతంలో అంత రేటు పెట్టి ఎవరు కొంటారు... ఇదేమయినా బొంబాయా...వాడు చెప్పినట్లు కొనడానికి...'' అన్నాడు.

''నిజమే మరి... అంత రేటయితే ఎవరు కొంటారు....'' అన్నాను మాట కలుపుతూ.

అయితే... ఆ కాయలకు ఆయన డబ్బులివ్వని సంగతి మాత్రం నాకు అంతు చిక్కలేదు.

ఈ విషయాలన్నీ గమనిస్తూంటే... ఎపుడో చదివిన గాంధీజీగారి ఇంగ్లీషు పాఠం... ''ద థర్డ్ క్లాస్ ప్యాసెంజర్'' జ్ఞప్తికొస్తూ ఉంది.

ప్రయాణంలో అప్పుడప్పుడు ఆయన నాతో మాటలు కలపసాగాడు. మాటల మధ్యలో తన తాలుకు సమాచారమంతా అడక్కుండానే చెప్పుకుపోయాడు.

తనపేరు నరసింహమట. ఆ ప్రాంతపు ఎం.ఎల్.ఏ. బావమరిదట. తనూ సర్పంచ్‌గా ఉన్నాడట. జిల్లా కేంద్రంలో టీచర్ల కౌన్సిలింగ్ జరుగుతూ ఉందట. తనకు కావలసిన వాళ్ళకు రెకమెండేషన్ చేయటానికి వెళ్తున్నాడట. అదీ విషయం.

''మీరెక్కడెళ్తున్నారమ్మా-'' అంటూ వివరాలడిగాడు.

''మాది కర్నూలని, భర్త ఇటీవలే కర్నూలు నుండి తిరుపతికి ట్రాన్స్‌ఫర్ మీద వెళ్ళాడని, తిరిగి కర్నూలుకే రావటానికి ప్రయత్నిస్తున్నామని...'' వివరించాను.

''మీ కేదయినా సహాయం కావాలంటే చెప్పండమ్మా. హెడ్డాఫీసు హైదరాబాద్‌లో నయినా పని చేపిద్దాము.. ఇదిగో నా విజిటింగ్ కార్డు. అవసరమయితే ఫోను చేయండి'' అంటూ ఇచ్చాడు.

నాకయితే వెతకబోయిన తీగ కాలికి తగిలినట్లుంది.

ట్రాన్స్‌ఫర్ కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతూ, విసిగి వేసారుతున్న నా భర్త జ్ఞప్తికొచ్చాడు. ఇదేదో మంచి అవకాశం లాగుంది.

''అయ్యా బాబూ... కళ్ళులేని కబోదినండి. దానం చేయండి బాబూ...దానం చేయండి...'' అంటూ చేతులు చాస్తూ, ఓ అవిటి వాడు వచ్చాడు.

వెంటనే పది రూపాయలనోటు తీసిచ్చాడు నరసింహం...

చిల్లర లేదంటే బాగుండదని, ఐదు రూపాయలిచ్చాను. వాడు డబ్బు చూసుకుంటూ వెళ్ళిపోయాడు...''పాపం...కదమ్మా కళ్ళులేవు....'' అంది రమ బాధపడుతూ..

వివరాలు చెప్పి, ఫోన్ నెంబరు, అడ్రసు ఇచ్చాను, నరసింహానికి. ఎలాగయినా కర్నూలుకు బదిలీ అయ్యేలా ప్రయత్నించమన్నాను. అంతో ఇంతో ఏదయినా ఖర్చుఅయినా పెట్టుకుంటామని గూడా అన్నాను.

''అయ్యో... అదేం మాటమ్మా. అక్కడంతా మనకు తెలిసినోళ్ళు ఉండారు గద...! వాళ్ళకు చెబితే... పనిచేసి పెడతార్లేమ్మా అదేం తొందర లేదు. మహా అయితే ఆ సెక్షన్ క్లర్కులకు పాతికో, పరకో ఇస్తే పనయిపోతుంది. ఏం పరవాలేదులేమ్మా...'' అంటూ అభయహస్తాన్నిచ్చాడు నరసింహం.

ఎంతో భారం దిగిపోతున్న భావన. ఆపదల్లో ఆదుకునే కృష్ణ పరమాత్మ లా అనిపించాడు. నిశ్చితంగా కర్నూలులోనే ఉండిపోవచ్చన్న తృప్తి.

''టికెట్...టికెట్...'' టికెట్ కలెక్టర్.

పక్కసీట్లో టికెట్‌లేని ఒక వ్యక్తిని గదమాయిస్తున్నాడు. ఫైన్ కట్టమంటున్నాడు.

''నా దగ్గర చిల్లిగవ్వగూడా లేదు సార్... మా ఊర్లో బతకలేక కూలి పనులకు పోతాండాం సామి..పక్కటేషన్లో దిగిపోతాం...'' అని బ్రతిమాలుకుంటున్నాడు. టి.సి. ఎంతకూ వినడంలేదు. వాడిని ఈడ్చుకుంటూ ఇవతలికొచ్చాడు. నా ఎదురుగా ఉన్న ముగ్గురూ లేచి నమస్కారం చెప్పి కూర్చున్నారు. టికెట్‌లేని వ్యక్తిని నరసింహం పిలిచాడు. టి.సి. వాడిని నరసింహం ముందుంచాడు.

''ఎక్కడికి పోతున్నావురా...'' అన్నాడు అధికార స్వరంతో నరసింహం.

''కూలిపనికి పోతున్నాం సామి...'' అన్నాడు పేద ముఖం పెట్టి.

''కూలిపనికి పోయేవాళ్ళదగ్గర ఏం డబ్బులుంటాయి. వాళ్ళేం టికెట్టు కొంటారు సార్... మీరు మంచోడ్ని పట్టుకున్నారు గాని...'' అని టి.సి.కి చెప్పి, మళ్ళీ వాడివైపు తిరిగి..

''పది రూపాయలుంటే ఇచ్చిపోరా. దొరికినా పొద్దేగద నువ్విచ్చేది...'' అని పురమాయించాడు.


వాడు జేబులోంచి పదిరూపాయలనోటు తీసి నలుపుతూ నలుపుతూ ఇస్తూ... ''ఈ పది రూపాయలే సామి ఉండేది...'' అని ఏడ్చాడు.


''ఎక్కడికి సార్ వెళ్తున్నారు...?'' అన్నాడు టిసి నరసింహాన్ని.

''జిల్లా కెళ్తున్నాము..'' అన్నాడు.

అటు టి.సిగాని, ఇటు వీళ్ళుగాని- టికెట్ల గురించి పట్టించుకోలేదు. వాళ్ళ నమస్కారాలే టికెట్లకు ప్రతిరూపాలేమో-అనుకున్నాను. టి.సి. వెళ్ళిపోయాడు.

''ఈ దేశం ఎపుడు బాగు పడుతుందో..
స్థితి లేని వాడు టికెట్టు కొనలేదు...
స్థితి ఉన్న వాడు టికెట్టు కొనరు... ఏమిటో ఈ లోకం...'' అని మనసులో నొచ్చుకుంటూ వెళ్ళిపో






సినిమాల్లో నటించి పేరు తెచ్చుకోవడం కంటే, ఇతరత్రా విషయాల్లోనే కత్రినాకైఫ్‌కే ఎక్కువ పేరొస్తోంది. ఐశ్వర్యా నుంచి సల్మాన్ విడిపోయిన తరువాత మెల్లిగా కత్రినా దగ్గరైంది. 'బూమ్'లో ఎక్స్‌పోజింగ్ ఎక్కువైందని సల్మాన్ కోప్పడేవరకూ కథ నడిచింది. ఆ తరువాత 'మైనే క్యోంకీ ప్యార్ కియా'లో సల్మానే కత్రినాకి అవకాశం ఇప్పించాడు. అది హిట్ అయ్యేసరికి వరుసగా ఛాన్స్‌లొచ్చాయి. ఇప్పుడు అక్షయ్ కుమార్‌తో నటిస్తోంది. ఆ సినిమా షూటింగ్ జరుగుతున్న స్టూడియోలోనే వివేక్ ఒబెరాయ్ సినిమా కూడా షూటింగ్ వుండడంతో అతనితో కత్రినా అనివార్యంగా మాట్లాడాల్సి వచ్చింది. ఇది తెలిసి సల్మాన్ అగ్గిమీద గుగ్గిలమై మండిపోతున్నాడని బాలీవుడ్ టాక్.

యాడు టి.సి.

రైలు ఆగింది... నలుగురూ దిగటానికి సిద్ధ పడుతున్నారు.

'ఏ సహాయం కావాలన్నీ మీరు ఫోను చేయండమ్మా... నిముషంలో చేయిద్దాము...'' అని రైలు దిగిపోయాడు నరసింహం.

రైలు కదిలిపోతూ ఉంది.

అనాలోచితంగా కిటికిలోంచి చూశాను.

ఆ నలుగురు ఎందుకో... ఇందాక రైలులో అడుక్కున్న అవిటివాడి చేతిలోని డబ్బులతో వాదులాడుకుంటున్నారు.

వాళ్ళు వెళ్తూ ఉంటే, వాళ్ళ వెంట వీడు కుంటు కుంటూ, ఏడ్చుకుంటూ పరిగెడుతున్నాడు. నా కంటిమేరా చూస్తూండిపోయాను. మనసులో ఏదో కదలిక.

కొద్ది సేపటికి టి.సి వచ్చి నా ఎదురు సీట్లో కూర్చున్నాడు.

''చూడమ్మా...ప్రపంచం ఎట్లుందో... ఇందాక ఇక్కడున్నాడే... ఆయన ప్రెసిడెంటు... రైలంతా వీళ్ళ సామ్రాజ్యమయినట్లు, టికెట్లు గూడా కొనరు. రైల్లో పండ్లవాళ్ళను, బిక్షగాళ్ళను, ఎవ్వరినీ ప్రశాంతంగా ఉండనివ్వరు. వీళ్ళంటే భయం వాళ్ళకు పాపం... అయినా... ఎవరికాలం ఎన్నాళ్ళులేమ్మా....'' అని నిట్టూరుస్తూ వెళ్ళిపోయాడు టి.సి.

డబ్బులాక్కొని వెళ్తూ ఉంటే, కుంటుకుంటూ వారివెంట పరిగెత్తిన అవిటి వాడు, డబ్బు తీసుకోకుండా పండ్లను పోగొట్టుకున్న పండ్లవాడు, టికెట్టు కొనలేని ప్రయాణికుడి ఏడుపు ముఖం, పరిస్థితుల్ని వివరిస్తున్న టి.సి మాటలు– నా స్మృతి పథం నుండి ఎక్కడికీ వెళ్ళవు. నాలో విద్యుత్తు తీసేసిన భావన.

రైలు ప్రయాణం సరదాగానే ఉంటుందనుకుంటే, అది కొన్ని జీవితాల్ని తెలుపుతుందని ఇపుడే తెలిసింది.

నరసింహం తన పేరును సార్థకత చేసుకున్నాడు.

భిక్షగాడి నుండి డబ్బులాక్కున వైనం,
డబ్బులివ్వకుండా పళ్ళు తీసుకున్న తీరు,
టికెట్టు లేకుండా దర్జాగా చేసిన ప్రయాణం,
అవీ ఇవీ అన్నీ కలిపి...నరసింహం...

అన్నీ సరే..

నరసింహం అంటే... మనుషుల్ని తినే సింహం అని గదా అర్థం...!

అన్నట్లు నరసింహం నాకు పది రోజుల తర్వాత ఫోను చేశాడు.

''ట్రాన్స్‌ఫర్ తప్పకుండా అవుతుందట...సెక్షన్ క్లర్కు ఇరవైవేలు అడుగుతున్నాడు. ఆలోచించి చెపితే, ప్రయత్నిద్దాము...'' అని చెప్పాడు అగంతకుడు.

ఫోనులో నుంచి మాటలలా వస్తూనే వున్నాయి.

నేనే వినడం మానేశాను.

★